మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట



## జాతీయ అర్హత పరీక్ష కట్టుదిట్టంగా నిర్వహించాలి



పరీక్ష కేంద్రాలను పరిశీలన చేస్తున్న కలెక్టర్, ఎస్పీలు

**గద్వాల,మార్చి 4 ప్రభాతవార్త:** జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ యూజీ 2025 నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జోగులాంబ గద్వాల్ జిల్లా పరిధిలోని ఎస్.ఆర్. విద్యానికేతన్ (గద్వాల్),సరస్వతి స్కూల్ (ఎర్రవల్లి) పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ టీ. శ్రీనివాసరావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గదుల వసతులు, సీటింగ్ ఏర్పాట్లు, సీసీటీవీ నిఘా, వెంటిలేషన్, తదితర అంశాలను పరిశీలించి, పాఠశాల యాజమాన్యానికి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ యూజీ 2025 (మే 4, 2025) నిర్వహణకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తగిన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు తగినంత సీటింగ్ సామర్థ్యం ఉండేలా చూడాలని, అలాగే సీసీటీవీ పర్యవేక్షణ తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ప్రశ్నపత్రాల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయాలు, పరిశుభ్రత, టాయిలెట్ వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, పరీక్షా కేంద్రాల వద్ద శుభ్రత, ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్ గని, కోఆర్డినేటర్ వెంకటేష్, ప్రిన్సిపాల్స్ రాములు, నందిని, సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## ఇదేం సాంబారు..

**అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ .. కౌకుంట్ల మండలంలో పర్యటన**

**ఎం.పి.డి. ఓ కార్యాలయం, జడ్.పి.ఉన్నత పాఠశాలల తనిఖీ**



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో మార్చి 4 ప్రభాతవార్త :** కౌకుంట్ల మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం పర్యటించి ఎంపిడిఓ కార్యాలయం,జడ్పి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాత జి.పి. కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎంపిడిఆర్ కార్యాలయంను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఫర్నిచర్, సివిల్ వర్క్, కంప్యూటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.తర్వాత జడ్పి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను కలెక్టర్ రుచి చూసి పరిశీలించారు. సాంబార్ సరిగా లేకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని అన్నారు. పదవ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలలో బోధన,మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ గురించి కలెక్టర్ విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 3 రోజులు రాగి జావ,మూడు రోజులు గుగ్గిళ్ళు స్నాక్స్‌గా ఇస్తున్నారని తెలిపారు. కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఎంపిడిఓ, తహశీల్దార్ లు పాఠశాలను సందర్శించి విద్యార్థులు తెలిపిన విషయాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. తర్వాత పిహెచ్‌సికి స్టల పరిశీలన చేశారు. ల్యాండ్ సర్వే ఏ.డి.స్థలం పరిశీలన చేసి ఎటువంటి లిటిగేషన్ లేదని నిర్ధారణ చేసిన తర్వాత కేటాయింపు చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఎంపిడిఓ శివ ప్రసాద్, తహశీల్దార్ రహమాన్ తదితరులు ఉన్నారు.

**నాణ్యమైన భోజనం అందించాలని**

## పాఠశాల ఎదుట ధర్నా





ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్లో) వంటలను పరిశీలిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, మార్చి 4 ప్రభాతవార్త :** విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల హైస్కూల్ ముందు విద్యార్థులచే పిడిఎఫ్‌యూ నాయకులు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎస్. సాయికుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో అందించడం లేదన్నారు. మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉండడం వల్ల విద్యార్థులు తినలేక పోతున్నారన్నారు. ఇది ఇలా ఉండగా మరి కొంతమంది విద్యార్థులు ఇండ్ల దగ్గరకు వెళ్లి తింటున్నారన్నారు. నాణ్యత లేని భోజనం కారణంగా – మిగతా4లో..

**ఐదు నిమిషాలు**

# ఆలస్యమైనా ఓకే..

- ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ
- నిమిషం నిబంధన ఎత్తివేసిన ప్రభుత్వం
- 9.05గంటల వరకు కేంద్రంలోకి అనుమతి
- ఉమ్మడి జిల్లాలో 124 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 65219 మంది విద్యార్థులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 4, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. మొదటి సంవత్సరం పరీక్షలు నేటి నుంచి (మార్చి 5) ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 124 కేంద్రాల్లో 65219మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈమేరకు విద్యాశాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్షలు నిర్వహించే మార్చి 5 నుండి ఏప్రిల్ 4వరకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఫస్ట్ ఎయిడ్, ఏఎన్ఎం లను, మందులు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు గ్రామీణ ప్రాంతం నుండి అలాగే పట్టణ ప్రాంతాలలో సరైన బస్సులు నడపాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆర్టిఓ అధికారులు పరీక్ష ప్రశ్నాపత్రాలను తీసుకువెళ్లేందుకు సరైన వాహనాలను ఏర్పాటు చేశారు.

**'నిమిషం' నిబంధన ఎత్తివేత..**

మొదటి సంవత్సరం పరీక్షలు నేటి నుంచి (మార్చి 5) ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమనే నిబంధనను ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు అంటే.. ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రానికి కాస్త ముందుగా చేరుకుంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని బోర్డు అధికారులు విద్యార్థులకు సూచించారు. ఇక నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్య.. విద్యార్థులకు ఓఎంఆర్ పత్రాన్ని అందజేస్తారు. వీటిని విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

**ఉమ్మడి జిల్లాలో ఇంటర్మీడియేట్ విద్యార్థులు**

| జిల్లా | విద్యార్థులు | పరీక్షా కేంద్రాలు |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 22,483 | 36 |
| జోగుళాంబ గద్వాల | 8341 | 14 |
| నారాయణపేట | 8791 | 16 |
| వనపర్తి | 12150 | 25 |
| నాగర్‌కర్నూల్ | 13454 | 33 |

**పకడ్బందీగా ఏర్పాట్లు..**



మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను 22483 మంది విద్యార్థులు రాయనుండగా, పరీక్షల కోసం 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. 144 వ సెక్షన్ విధించాలి. ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేయాలి. జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఆయా శాఖల అధికారులకు పలు సూచనలను, ఆదేశాలను జారీ చేశాం.

*– మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి*

**పరీక్ష కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి**



మహబూబ్‌నగర్ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలుచేస్తున్నట్లు ఎస్పీ డి.జానకి తెలిపా రు. జిల్లాలోని 36 పరీక్షా కేంద్రాల్లో మార్చి 5 నుండి 22వరకు జరగనున్న ఇంటర్ పరీక్షల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ అన్ని రకాల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసిందన్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ట్యాబ్‌లు, పెన్ డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు, వాలెట్లు అనుమతించబడవన్నారు.శాంతియుత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అందరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

*– మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి*

**వనపర్తి పురపాలికలో 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి**

## రూ.45.11కోట్ల బడ్జెట్‌కు ఆమోదం



పురపాలిక సమావేశంలో బడ్జెట్‌పై మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తిటౌన్, మార్చి 4 ప్రభాతవార్త:** 2025,26 ఆర్థిక సంవత్సరంలో వనపర్తి పురపాలికలో రూ. 45.11 కోట్ల ఆదాయం సమకూరనున్నట్లు వేసిన అంచనా బడ్జెట్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆమోదించారు. ఇందులో మున్సిపాలిటీలో వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు 15వ.ఫైనాన్స్, స్టేట్ ఫైనాన్స్ నిధులు ఉన్నాయి. మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 2024 25 సవరించిన బడ్జెట్, ఇప్పటి వరకు అయిన ఖర్చులు, 2025,26 ఆర్థిక సంవత్సరంలో అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అకౌంటెంట్ కృష్ణయ్య బడ్జెట్ వివరాలను చదివి వినిపించారు. 202425 ఆర్థిక సంవత్సరంలో రూ.26.36 కోట్ల అంచనా బడ్జెట్ ను ప్రతిపాదించగా 2025 సవరించిన బడ్జెట్ విలువ రూ.39.28 కోట్ల ఆదాయంగా పద్దులో చూపించారు. ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 11.67 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 45.11 కోట్ల ఆదాయం వివిధ మార్గాల ద్వారా సమకురనున్నట్లు అంచనా వేశారు. ఇందులో 10 శాతం నిధులు మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు గ్రీన్ బడ్జెట్ గా కేటాయించినట్లు చూపించారు. 1/3 వంతు బడ్జెట్‌ను పురపాలక సంఘంలోని విలీనమైన ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, మైనారిటీ, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాలు, మురికి వాడల అభివృద్ధికి వాడనున్నట్లు పేర్కొన్నారు. పురపాలికలోని 33 వార్డుల అభివృద్ధి కొరకు దాదాపు రూ. 22.26 కోట్లు – మిగతా4లో..

**ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను**

## పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, మార్చి 4 ప్రభాతవార్త :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్ర మున్సిపాలిటీలో కమిషనర్ భోగీశ్వర్ అధ్యక్షతన ఎల్ ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈసదస్సుకు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి సమస్యలు లేని వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. 2020 లో దరఖాస్తు చేసుకున్న వారికి అప్పటి మార్కెట్ వాల్యూ ప్రకారమే ఫీజు ఉంటుందని, ఇది మంచి అవకాశమని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కమిషనర్, టీపీఓ సమన్వయం చేసుకుని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కాగా సదస్సులో పలువురు రియల్ వ్యాపారులు తమ తమ సందేహాలను ప్రస్తావించారు. వారి సందేహాలను టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కిరణ్ కుమార్ నివృత్తి చేశారు. ఈ సదస్సుకు టౌన్ బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు,ఎల్‌టీపీలు, డాక్యుమెంట్ రైటర్లు, ప్లాటు యజమానులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మున్సిపాలిటీలోని ఎల్ ఆర్ ఎస్ హెల్ప్ డెస్క్‌ను, కాల్ సెంటర్‌ను పరిశీలించారు.

**మరింత వేగంగా**

## మట్టి తోడివేత



కన్వేయర్ బెల్ట్ ద్వారా మట్టి తోడివేత పనులు

- కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ
- గంటకు 800 టన్నుల మట్టి బయటికి చేరవేత
- ఢిల్లీ నుండి నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం
- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యలు వేగవంతం

**నాగర్ కర్నూల్ ప్రతినిధి, మార్చి 4 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో దోమలపెంట ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ పై సమీక్ష సమావేశాన్ని డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నిర్వహించారు. ఈ సమావేశంలో టన్నెల్ ఇన్ లెట్ ఆఫీస్ వద్ద రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న బృందాల అధికారులతో జరిగిన సమీక్షలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు (ఎస్‌ఎల్‌బిసీ) సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యలపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ డిజిపి నాగిరెడ్డి, టీఎస్ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌ఆలీ, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి ప్రసన్న, హైడ్రా, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎస్డీఆర్‌ఎఫ్ అధికారి, ఫైర్ సర్వీసెస్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, ర్యాట్ మైనర్స్, ప్రతినిధులు పాల్గొన్నారు. టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ పురోగతి, ఎదురవుతున్న సవాళ్లు, మైనింగ్, ఫైర్ సర్వీసెస్ బృందాల కృషి, ర్యాట్ మైనింగ్ ప్రత్యేకతలు, ప్లాస్మా కట్టర్స్ వినియోగం వంటి అంశాలపై సమీక్ష జరిగింది. రెస్క్యూ చర్యలను వేగవంతం చేయడం, బృందాల మధ్య సమన్వయం పెంచడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కన్వేయర్ బెల్ట్‌ను పునరుద్ధరించిన కారణంగా గంటకు 800 టన్నుల మట్టిని బయటకు తీసుకురాగలమని అధికారులు వెల్లడించారు. టన్నెల్లో కొనసాగుతున్న సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రౌండ్ పేనిట్రేటింగ్ రాడార్ ద్వారా గుర్తించిన ప్రదేశాల్లో తవ్వకాలు జరుగుతున్నాయని, కన్వేయర్ బెల్ట్ సిద్ధంగా ఉండటంతో వీలైనంత త్వరగా మట్టిని బయటకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. రెండు ఎస్కలేటర్లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. టన్నెల్ బోరింగ్ మిషన్ చివరి భాగాలను గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించి లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకురానున్నట్లు తెలిపారు. సహాయక చర్యలకు ఆటంకంగా మారుతున్న నీటిని ఎప్పటికప్పుడు పంపుల ద్వారా బయటకు పంపిస్తున్నట్లు వివరించారు. సహాయక బృందాలకు అవసరమైన ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలియజేశారు.





సహాయక చర్యల్లో సిబ్బంది



సహాయక చర్యలపై సమీక్షిస్తున్న డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ , కలెక్టర్ సంతోష్

**జాతీయ రహదారిపై**

## రోడ్డు ప్రమాదం

**రెండు డీసీఎం లు ఒక కంటైనర్**

**కంటైనర్ లో షోరూం కార్లు ఉండగా రెండు కార్లు డామేజ్**

**రెండు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్**



రెండు వాహనాలను ఢీకొన్న డిసిఎం

**పెబ్బేరు, మార్చి 4 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై మంగళవారం రోజు ఉదయం 7 గంటల ప్రాంతంలో రెండు డీసీఎం లు ఒక కంటైనర్ ఒకదానికొకటి తగలగా డ్రైవరు కు స్వల్ప గాయాలతో పరారైనట్లు వాహన డ్రైవర్లు తెలియజేశారు. కంటైనర్ టైర్ పంచర్ కావడంతో పక్కకు ఆపుకొని చూస్తుండగా అదే సమయంలో అతివేగంతో వెళ్తున్న డీసీఎం మరో డిసిఎంను ఢీకొని ఆగి ఉన్న కంటైనర్ కు ఢీకొన్నాయి. మొత్తంగా మూడు వాహనాలు యాక్సిడెంట్ అయింది. డీసీఎం అతి జాగ్రత్త, అతివేగంతో రెండు ఇతర వాహనాలకు భారీ నష్టం జరిగిందని వాహనదారులు తెలియజేశారు. ఆగి ఉన్న కంటైనర్ లో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు షోరూం కార్లు తీసుకుపోతున్నామని 8 కార్ల గాను రెండు కార్లు పూర్తిగా డామేజ్ అయినవని కంటైనర్ డ్రైవర్ తెలియజేశాడు. ఈ రోడ్డు ప్రమాదం వల్ల రెండు గంటల పైగా స్తంభించి పోయిన వాహనాలు వెంటనే పోలీసులు, పెట్రోలింగ్ పోలీసులు, నేషనల్ హైవే వారు అక్కడికి చేరుకొని స్తంభించిన ట్రాఫిక్ ను క్లియర్ చేసి రోడ్డుకు అడ్డంగా పడిన వాహనాలను క్రేన్ సహాయంతో పక్కకు జరిపారు. పూర్తి వివరాలను పూర్తి సమాచారం కోసం ఎంక్వయిరీ చేస్తున్నామని పెబ్బేర్ ఎస్సై సిహెచ్ హరిప్రసాద్ రెడ్డి తెలియజేశారు.

